

## డాక్టర్ అరవింద్‌రెడ్డికి బీజేపీ నల్గొండ జిల్లా ప్రొఫెషనల్ సెల్ కన్వీనర్‌గా నియామకం

నల్గొండ జూన్ ,24(వుదయం ప్రతినిధి):నల్గొండ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ అరవింద్‌రెడ్డిని భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా ప్రొఫెషనల్ సెల్ కన్వీనర్‌గా నియమించారు.

వైద్య వృత్తిలో ఎన్నో సంవత్సరాలుగా పేద, నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ సామాజిక సేవలో ఆయన విశేష కృషి చేస్తున్నారని పార్టీ నాయకులు పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా బీజేపీ అభివృద్ధి, బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఆయన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

జిల్లా కార్యవర్గ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి ప్రతాప్ చేతుల మీదుగా డాక్టర్ అరవింద్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు.నల్గొండ పట్టణంలో బీజేపీని మరింత బలోపేతం చేయడంతో పాటు సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి డాక్టర్ అరవింద్‌రెడ్డి కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## సంతోషిమాతకు 'త్రిభువన పట్టాభిషేకం'

### సూర్యాపేటలో వైభవంగా 31వ వార్షిక బ్రహ్మోత్సవం

సూర్యాపేట జూన్ 24: వుదయం ప్రతినిధి





సూర్యాజిల్లా కేంద్రంలో శ్రీ సంతోషిమాత దేవాలయం ప్రతిష్టించి 31 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుదవారం దేవాలయంలో బ్రహ్మోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు ఇరువంటి శివ రామ కృష్ణ శర్మ, పరిమి శివరామ జగన్నాథ శర్మ, అశోక్ మిశ్రా లు శ్రీ సంతోషిమాత, శ్రీ సత్య సాంబశివుడు, శ్రీ లక్ష్మీ గణపతి, క్షేత్రపాలక ఆంజనేయస్వామి, సంతాన నాగదేవత ,మానస దేవి మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు అలంకరణలు నిర్వహించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలతో సామూహికంగా కుంకుమార్చన పుష్పార్చన, గాజుల పూజ, పసుపు కొమ్ముల పూజలు నిర్వహించారు. అనంతరం రుద్ర, లలిత, గణపతి హాటరీమాన్ని నిర్వహించి మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీ సంతోషిమాత అమ్మవారికి త్రిభువన మహా సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించి భక్తులందరికీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషిమాత దేవాలయగౌరవ అధ్యక్షులు నూక వెంకటేశం గుప్త అధ్యక్షులు బ్రాహ్మ0డ్లపల్లి మురళీధర్ కోశాధికారి కొత్త మల్లికార్జున్ ఉపాధ్యక్షులు పబ్బా ప్రకాశరావు, సోమ శ్రీశైలం, దేవరశెట్టి సోమయ్య, మహంకాళి ఉపేందర్, నూక ముత్యాలమ్మ ,బ్రాహ్మ0డ్లపల్లి నాగమణి, మహంకాళి కవిత, బచ్చు నీరజ, ఓరుగంటి కనకరత్నం, వందనపు వెంకటేశ్వర్లు , లక్ష్మారెడ్డి,దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

### రెండు [illegible] చెక్కుల ద్వారా రూ. 5.25 లక్షల ఆర్థిక సహాయం అందజేత





దమ్మపేట జూన్ 24 (వుదయం ప్రతినిధి ):అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిని సందర్శించి అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురు రోగులను పరామర్శించారు వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు

ఈ సందర్భంగా అత్యవసర శస్త్రచికిత్స అవసరమైన అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రానికి చెందిన పెంకే మోహన్ గారికి రూ. 2,75,000/- విలువైన ఎల్ ఓ సి చెక్కును అందజేశారు అలాగే ములకలపల్లి మండలం మధారం పంచాయతీ మంగపేట గ్రామానికి చెందిన కుంజా వెంకటేశ్వర్లు గారికి రూ. 2,50,000/- విలువైన ఎల్ ఓ సి చెక్కును నేరుగా ఆసుపత్రిలో అందించి ఆర్థిక భరోసా కల్పించారు.

## మధిర గ్రీన్ ఫీల్డ్ మినీ ఇండోర్ స్టేడియం అభివృద్ధికి రూ.5.50 కోట్లతో క్రీడా సదుపాయాలు.



మధిర జూన్ 24, వుదయం ప్రతినిధి: మధిర ప్రాంతయువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు మధిరమున్సిపాలిటీ రెండో వార్డ్ నందు గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియం అభివృద్ధికి తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఐదు కోట్ల 50 లక్షల రూపాయలను మంజూరు చేస్తూ జీవో అధికారికంగా విడుదల చేసిన సందర్భంగా డివైఎస్ఓ తంబూరి సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ సామినేని సుజాత రామనాథం, వైస్ చైర్ పర్సన్ కోన దాని కుమార్, మున్సిపల్ కమిషనర్ సామ్యేల్ బెనిడెక్ పాల్, మధిర తాహాసిల్దార్ రాళ్ల బండి రాంబాబు, మధిర టౌన్ సీఐ రమేష్ ,ఆర్టీసీ డిపో మేనేజర్ తడికమళ్ళ దేవరాజ్, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్, కాంగ్రెస్ పార్టీ టౌన్ మరియు రూరల్ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు పారుపల్లి విజయకుమార్, డెవలప్మెంట్ కమిటీ వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బెజవాడ రవిబాబు,మిర్యాల రమణ గుప్తా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పార్టీల సత్యంబాబు, కౌన్సిలర్లు యన్నం కోటేశ్వరరావు, రమణ నాయక్ , దార నాగర్జున, డాక్టర్ వాసిరెడ్డి సతీష్, ఏఎంసి డైరెక్టర్ తోములూరి రాజా , మధిర మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగవీటి రాజశేఖర్, స్టేడియం ఇంచార్జ్ వై చిన్ని, బ్యాట్మెంటన్ కోచ్ సునీల్, కబడ్డీ కోచ్ ప్రవీణ్, తదితరులు. పాల్గొని బట్టి విక్రమార్క గారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. మధిర అభివృద్ధిలో భాగంగా క్రీడా రంగాన్ని కూడా పెద్ద ఎత్తున అభివృద్ధి చేసేందుకు నిధులను కేటాయించడంపై మధిర మధిర మండల ప్రజలంతా వర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ నిధులతోమధిర స్టేడియంలో డార్మిటరీ భవనం,వాలీబాల్ కోర్టులు, క్రికెట్ టర్ఫ్‌లు,ఓపెన్ జిమ్, ఖో-ఖో, కబడ్డీ కోర్టులు,400 మీటర్ల రన్నింగ్ ట్రాక్,ఫుట్‌బాల్ మైదానం, హైమాస్ట్ లైట్లు,సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పార్కింగ్, గ్రీనరీ తదితర ఆధునిక క్రీడా సదుపాయాలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియకు రాజకీయ పార్టీల సహకారం అవసరం : కలెక్టర్ అంకిత్

### జూన్ 25 నుంచి ఇంటింటికీ బీఎల్‌వోల సర్వే -- అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 24 ( వుదయం ప్రతినిధి): జిల్లాలో ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎస్ఐఆర్ ప్రక్రియపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

అంతకుముందు మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయికృష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ చేపట్టే విధానం, ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణ, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ప్రక్రియలు, సాంకేతిక సమస్యల పరిష్కార చర్యలపై వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రక్షాళన విజయవంతం కావాలంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ సహకరించాలని కోరారు. ఇప్పటికే బీఎల్‌వోలు, బీఎల్ఏలు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసినట్లు తెలిపారు.

జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల ద్వారా ఓటర్ల వివరాలను సేకరిస్తారని చెప్పారు. 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ధృవీకరించి నమోదు చేస్తామని పేర్కొన్నారు. జూలై 24 నుంచి 30 వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతామని వెల్లడించారు.

జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని, అనంతరం అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తప్పు సమాచారం సమర్పించిన సందర్భాల్లో వెంటనే పేర్లు తొలగించకుండా, నోటీసులు జారీ చేసి విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వలస వెళ్లిన, మరణించిన, డూప్లికేట్ ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగిస్తామని, కొత్తగా అర్హత సాధించిన వారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మారిన ఓటర్లు ఫారం-8 ద్వారా వివరాల సవరణ చేసుకోవచ్చని తెలిపారు. ప్రతిరోజూ బీఎల్‌వోలు గరిష్ఠంగా 50 ఫారాల వరకు సమర్పించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతుందని, 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే యువత కూడా కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల శాఖ సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంకటేశ్వర నాయక్, అన్వర్, లక్ష్మణ్ అగర్వాల్, అన్నవరపు సత్యనారాయణ, రవి నాయక్ తదితరులు, ఎన్నికల శాఖ సిబ్బంది నవీన్, అశోక్ పాల్గొన్నారు.

## ప్రజల రక్షణ కోసమే అత్యాధునిక ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ, సీసీటీవీ కెమెరాల వ్యవస్థ

### ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలిలి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట జూన్ 24 వుదయం ప్రతినిధిసూర్యాపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణ పునరుద్ధరణలో భాగంగా జిల్లా కేంద్రంలో బస్టాండ్ చౌరస్తా, ఖమ్మం క్రాస్ రోడ్ చౌరస్తా వద్ద అత్యాధునిక ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను, ముఖ్యమైన 9 కూడళ్లలో 20 ఆటోమేటిక్ సీసీటీవీ కెమెరాలను బుధవారం ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ,సూర్యాపేట మున్సిపాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ లో భాగంగా పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే ఖమ్మం చౌరస్తా, బస్టాండ్ చౌరస్తా కూడళ్ల వద్ద అత్యాధునిక సాంకేతికతతో కూడిన సరికొత్త ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు సిసి కెమెరాల వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారని అన్నారు. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యంత శాస్త్రీయంగా నూతన సిగ్నలింగ్ వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు. జంక్షన్ల వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు ఆటోమేటిక్ నంబర్ ప్లేట్లను గుర్తించే ప్రత్యేక సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని, దీని ద్వారా వాహనాల కదలికల పై నిరంతర నిఘా ఉంటుందని అన్నారు. సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఇతర ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వాహనదారులను ఈ కెమెరాల ద్వారా సులభంగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ రెండు కూడళ్లలో రికార్డ్ అయ్యే ఫోటోలు, వీడియోలు నేరుగా జిల్లా ఎస్పీ కార్యాలయంలోని ప్రధాన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించబడి ప్రత్యేక బృందాలు పర్యవేక్షణలో ఉంటాయని. శాస్త్రీయ పద్ధతిలో సిగ్నల్స్ సమయాన్ని కేటాయించడం వల్ల వాహనదారులకు ట్రాఫిక్ జామ్ ఇబ్బందులు తొలగి సుఖవంతమైన మరియు సురక్షితమైన ప్రయాణ వీలు కలుగుతుందని అన్నారు. సూర్యాపేట పట్టణాన్ని సాంకేతికంగా మరింత అభివృద్ధి చేస్తూ, ప్రజల రక్షణే ధ్యేయంగా ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని అధికారులకు, జిల్లా వాహనదారులు ఈ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రజల రద్దీ, ప్రజల, వాహనదారుల అవసరాల దృష్ట్యా ప్రజా భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో సరికొత్త ట్రాఫిక్ సిగ్నల్స్, మరియు సీసీటీవీ కెమెరాల వ్యవస్థను ప్రారంభించామని. పట్టణ ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత, సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, స్థానిక కౌన్సిలర్ శ్రీవిద్య జ్యోతి కరుణాకర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ఇన్స్పెక్టర్ రమేష్.



మధిర జూన్ 24, వుదయం ప్రతినిధి: పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే శారీరక, మానసిక దుష్ప్రభావాలు,ఎన్?డిపిఎస్? చట్టం ప్రకారం ఉండే చట్టపరమైన శిక్షలు గురించి క్లుప్తంగా విద్యార్థులకు క్షుణ్ణంగా వివరిస్తూ చెడు స్నేహితుల ప్రభావం, సామాజిక ఒత్తిళ్లు డ్రగ్స్ వైపు తీసుకెళ్లే విధానంపై విద్యార్థులకు మార్గదర్శనం ఇవ్వడం జరిగింది.మాదక ద్రవ్యాల వినియోగం విద్య, భవిష్యత్ కెరీర్, కుటుంబంపై కలిగించే ప్రతికూల ప్రభావాలను ఇన్స్పెక్టర్ రమేష్ వివరించారు.

## నీతిమంతులు స్టేట్మెంట్...

### రాజకీయన్ని వ్యాపారం చేస్తున్న మీకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పిన.? గత పరిపాలన లో మీరుచేసిన అభివృద్ధి మీరు మార్చిన..?



పినపాక:( జూన్ 24వుదయం ప్రతినిధి) భద్రాద్రికొత్తగూడెం జిల్లా జానంపేట గ్రామ పంచాయతీ లో అక్రమాలు జరిగాయి అని కొంతమంది (నీతిమంతులు )స్టేట్మెంట్ ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనం చేస్తున్న మేధావులు ప్రతిపక్ష నాయకులు అని జానంపేట గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు అసలు అవినీతి కి అక్రమాలకు మీ టిఆర్ఎస్ నాయకులే అని 2023 అసెంబ్లీ 2024 పార్లమెంట్ 2026 పంచాయితీ ఎలక్షన్ లలో ప్రజలు తీర్పు ఇచ్చారు జానంపేట గ్రామ పంచాయితీ లో మీరు చేసిన అవినీతి ప్రజలకు తెలుసు మీరుచేసిన అవినీతి అందరు చేస్తారు అని ఉహించుకొని మాట్లాడడం కరెక్ట్ కాదని మీకు ఎప్పుడు అప్పుడు ప్రతి పనికి ఎంత ఖర్చు పెట్టినామో గ్రామసభ పెట్టి చదివి వినిపించడం జరుగుతుంది మీ లాగా ఫోర్జరీ సంతకాలతో గ్రామసభలు పెట్టకుండా గ్రామ పంచాయతీ సొమ్ము మెక్కినారు అవినీతి అడ్రస్ గా మారిన మీరా మమ్ములను అనేది మీ బాగోతలు దాచుకోవడానికి పక్కన వాళ్ళమీద నిందలు వేయకండి ఇకనుండి మారడం అలవాటు చేసుకోండి మీరు చేసిన అవినీతి జానంపేట ప్రజలు జీవితాంతం మరిచి పోరు అవినీతి పాలన చేసిన మీరు ప్రజా పాలన జరుగుతుంటే ఓర్వలేక విషం చిమ్ముతున్నారు.

బహిరంగ చర్చ కు సిద్ధమాగత పరిపాలన లో మీరుచేసిన అభివృద్ధి మీరు మార్చిన బిల్లులు మీరు మాయం చేసిన తీర్మానం బుక్ పట్టుకొని రాండి మేము చేసిన వాటికీ ఆదారాలతో వొస్తాము, గతంలో డీజిల్ ఖర్చు ఎంత వచ్చింది, ఇప్పుడు డీజిల్ ఖర్చు ఎంత వస్తుందో వచ్చిందో, డాక్టర్ల టైర్ల సైతం మార్చింది మీరు కాదా, కరెంటు బల్బుల విషయంలో అప్పుడు ఎంత ఖర్చు వచ్చింది ఇప్పుడు ఎంత ఖర్చు వచ్చిందో బహిరంగ చర్చకు మేము సిద్ధం మీద సిద్ధమా. ప్లేస్ డేట్ మీరే చెప్పండి చేతకాకపోతే గతంలో తిన్నవి అరిగించుకోవడానికి రెస్ట్ తీసుకోండి పనికిరాని పోస్ట్ లు పెట్టి నిరాధార ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక మా పైన అక్కసు వెళ్ళగక్కుతూ అధికార లేక మీ జేబులు నిండక మీ స్వార్థం కోసం రాజకీయన్ని వ్యాపారం చేస్తున్న మీకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పిన మీరు మారకపోతే మీకు ఎలా బుద్ధి చెప్పాలో మాకు తెలుసు

## గిరిజన గురుకులంలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

### 24 గంటల్లో పరిశుభ్రత చర్యలు పూర్తి చేయాలని ఆదేశం -- వార్డెన్‌కు మెమో జారీకి సూచన

### ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు



పరిశుభ్రత, నిర్వహణ విషయంలో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. అశ్వాపురం మండలంలో బుధవారం విస్తృతంగా పర్యటించిన కలెక్టర్, గొందిగూడెం గిరిజన ఆశ్రమ గురుకుల బాలుర పాఠశాలను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి పలు లోపాలను గుర్తించారు.

కంప్యూటర్ ల్యాబ్‌లో కంప్యూటర్లు దుమ్ము, ధూళితో అపరిశుభ్రంగా ఉండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, నాలుగు నెలల క్రితం ఇదే అంశంపై సూచనలు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు భారీ వ్యయంతో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను నిర్లక్ష్యంగా నిర్వహించడం బాధాకరమని పేర్కొంటూ, సంబంధిత సీటీవోతో ఫోన్‌లో మాట్లాడి కంప్యూటర్ ఇన్‌స్పెక్టర్ కాంట్రాక్టును రద్దు చేయాలని ఆదేశించారు.

వంటశాల, ప్రధానోపాధ్యాయుని గది, వసతి గృహాలను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడం లేదని గుర్తించి హాస్టల్ వార్డెన్‌ను వివరణ కోరారు. విద్యార్థుల సంఖ్య ఎంత ఉన్నప్పటికీ ప్రభుత్వ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. వసతి గృహాల్లోనూ పరిశుభ్రత లోపాలను గమనించిన కలెక్టర్, ప్రధానోపాధ్యాయుని గది మినహా పాఠశాలలోని ఇతర ప్రాంతాలన్నింటిలోనూ పరిశుభ్రత లోపించిందని అసహనం వ్యక్తం చేశారు.పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల తదితర ప్రాంతాల్లో 24 గంటల్లో పూర్తిస్థాయిలో పరిశుభ్రత చర్యలు చేపట్టి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత లోపాలు, మెనూ అమలులో నిర్లక్ష్యంపై హాస్టల్ వార్డెన్‌కు మెమో జారీ చేయాలని సూచించారు.అనంతరం కొత్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, మధ్యాహ్న భోజన నాణ్యత, మెనూ అమలుపై వివరాలు తెలుసుకున్నారు. హాజరు నమోదును యాప్ ద్వారా పరిశీలించి, ప్రతిరోజూ విద్యార్థుల హాజరును సక్రమంగా నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు

జన ఆశ్రమ గురుకుల పాఠశాలల్లో మెరుగైన వసతి, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.

అశ్వాపురం మండలం ఎలకలగూడెం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, ఇంటింటి సర్వే విధానం, దరఖాస్తుల పరిశీలన, యాప్‌లో వివరాల నమోదు తీరును సమీక్షించారు. అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, సమర్థవంతంగా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ఏ ఒక్క కుటుంబం కూడా సర్వేకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని, యాప్‌లో నమోదు చేసే వివరాల ఖచ్చితత్వంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, అశ్వాపురం మండలంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం మొత్తం 3,448 దరఖాస్తులు ఎల్-1 స్థాయిలో ఉండగా, వాటిలో 2,075 దరఖాస్తుల సర్వే పూర్తయిందని తెలిపారు. ఇప్పటివరకు 409 గుడిసెలను గుర్తించామని, మిగిలిన దరఖాస్తుల సర్వేను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఈ పర్యటనలో అశ్వాపురం ఎంపీడీవోతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగానికి దూరంగా ఉండాలి

**యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రమాదం**
**ఏసీపీ మడత రమేష్ హెచ్చరిక**




మంథని, జూన్ 24 (వుదయం ప్రతినిధి):ప్రస్తుత సమాజంలో మత్తు పదార్థాల వినియోగం, సోషల్ మీడియా దుర్వినియోగం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రమాదం ఉందని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ హెచ్చరించారు. మంథని పట్టణంలో నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మడత రమేష్ మాట్లాడుతూ యువత చిన్న చిన్న తప్పిదాలు చేసి పోలీసు కేసుల్లో ఇరుక్కోవడం వల్ల వారి బంగారు భవిష్యత్తు దెబ్బతింటుందని అన్నారు. ముఖ్యంగా ఆధార్ కార్డుతో అనుసంధానమైన పోలీసు రికార్డులు భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలకు ఆటంకంగా మారే ప్రమాదం ఉందని సూచించారు. మత్తు పదార్థాల విక్రయాలు, సోషల్ మీడియా వేదికల ద్వారా జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసు శాఖ నిరంతరం నిఘా ఉంచుతోందని తెలిపారు. తెలియక చేసే పొరపాట్లు కూడా జీవితాంతం ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి తమ పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశిస్తున్నారని, వారి కలలను నిజం చేసే బాధ్యత యువతపై ఉందన్నారు. క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకొని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని సీఐ బుద్ధ స్వామి, ఏఎస్ఐ మల్లయ్య గౌడ్, విద్యార్థులు, యువత మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# పేదల కలల సౌధం ఇందిరమ్మ ఇల్లు

ధర్మపురి,జూన్ 24(వుదయం ప్రతినిధి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాల సొంత ఇంటి కలను సాకారం చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి అన్నారు. బుధవారం ధర్మపురి పట్టణంలోని 13వ వార్డుకు చెందిన బండారి శంకర్, దీప దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహం లోకి అడుగుపెట్టిన లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఆమె శుభా కాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకం ఎంతో మంది నిరుపేదలకు అండగా నిలుస్తోందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చిపిరి శెట్టి రాజేష్, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ చిన్నారులకు యూనిఫాంలు, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



ధర్మపురి, జూన్ 24(వుదయం ప్రతినిధి):పట్టణంలోని 5వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు యూనిఫాంలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థు లకు పాఠ్యపు స్తకాలను మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి బుధవా రం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్య త్తుకు విద్యే బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రభు త్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి అవసర మైన సౌకర్యా లు, విద్యా సామగ్రిని అందించ డమే ప్రభుత్వ లక్ష్యమన్నా రు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కుని ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలనిఆకాంక్షించారు. చిన్నారులకు యూనిఫాంల పంపిణీ వారి విద్యా భ్యాసానికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందని,సకాలంలో పుస్తకాలు అందించ డం వల్ల కొత్త విద్యా సంవత్సరా న్ని విద్యార్థులు ఉత్సా హంగా ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యా యులు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, బీఎల్ఏల శిక్షణ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల వెల్లువ

**రేవంత్‌రెడ్డి చేసే ప్రతి కుట్రలో శ్రీధర్‌బాబు భాగస్వామి: జీవన్‌రెడ్డి**
**ప్రజాపాలన కాదు.. ప్రజావంచన పాలన: బీఆర్ఎస్ నేతల ధ్వజం**





మంథని, జూన్ 24 (వుదయం ప్రతినిధి):మంథని పట్టణంలోని ఎస్ఎల్‌బీ గార్డెన్‌లో మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ అవగాహన, బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి, ఉమ్మడి జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి తాటిపర్తి జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇన్‌చార్జి వీర్ల వెంకటేశ్వర్‌రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాటిపర్తి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకునే ప్రతి నిర్ణయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు భాగస్వామి అని ఆరోపించారు. రైతు భీమా, రైతుబంధు, సన్నరకాల వరి బోనస్ వంటి అంశాల్లో రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాలని, ఓటరు జాబితాల విషయంలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. మంథని నియోజకవర్గంలో రెండున్నర సంవత్సరాలుగా కొత్త అభివృద్ధి పనులు జరగలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన మాతా శిశు ఆసుపత్రిని ఇప్పటికీ ప్రారంభించలేకపోయారని విమర్శించారు. రైతులకు, విద్యార్థులకు, పేదలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ దుద్దిళ్ల కుటుంబానికి మంత్రి పదవి వచ్చిన ప్రతిసారి నియోజకవర్గంలో అరాచకాలే జరిగాయని ఆరోపించారు. గత 30 నెలల కాలంలో తనను బద్నాం చేయడం తప్ప ప్రజల కోసం ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని మంత్రి శ్రీధర్‌బాబుపై విమర్శలు గుప్పించారు. తాను ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం చివరి శ్వాస వరకు పోరాడుతానని ప్రకటించారు. కార్యకర్తలందరికీ రాజకీయ, సామాజిక, ఆర్థికంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇన్‌చార్జి వీర్ల వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ పార్టీపై జరుగుతున్న దుష్ప్రచారాలను సోషల్ మీడియా వేదికగా తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. త్వరలో డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు చేపడతామని తెలిపారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు, యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెవెన్యూ దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి

- ♦ రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్
- ♦ భూ భారతి, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు
- ♦ మీ సేవ ధ్రువపత్రాలను 30 రోజుల్లోగా జారీ చేయాలి
- ♦ సాదా బైనామా దరఖాస్తులను జూలై 10 నాటికి పరిష్కరించాలి



పెద్దపల్లి, జూన్–24 (వుదయం ప్రతినిధి) రెవెన్యూ సంబంధిత దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కొప్పుల వెంకట్ రెడ్డితో కలిసి రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూ భారతి, ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని తెలిపారు. కులం, ఆదాయం, నివాసం తదితర మీ సేవ ధ్రువపత్రాలను తప్పనిసరిగా 30 రోజులలోపు జారీ చేయాలని, ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచరాదని స్పష్టం చేశారు. 60 రోజులకుపైగా పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులను ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి జూలై 10వ తేదీలోగా అన్ని అర్హ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా అందించేందుకు అధికారులు కృషి చేయాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేకంగా రెవెన్యూ అధికారులు సిబ్బందితో రివ్యూ నిర్వహించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాధాబైనామ దరఖాస్తులన్నింటినీ జూలై 5వ తేదీలోగా పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన ప్రతి దరఖాస్తును ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.

ప్రజావాణి, భూ భారతి, రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండరాదని, పెండింగ్ దరఖాస్తులను ప్రత్యేక కార్యాచరణతో క్లియర్ చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో నాణ్యత, పారదర్శకత పాటించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్, జిల్లాలోని తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా గట్టమ్మ తల్లి పునః ప్రతిష్ట..

జూన్ 24 వుదయం ప్రతినిధి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని ఆశీరెడ్డిపల్లి గ్రామంలోని ప్రధాన కూడలి నందు ఉన్న గట్టమ్మ తల్లి శిథిలావస్థలో ఉండగా స్పందించిన గ్రామ సర్పంచ్ జక్కుల కుమారస్వామి ఆధ్వర్యంలో గట్టమ్మ తల్లి పునః ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. శిథిలా వ్యవస్థలో ఉన్నటువంటి పాత పురాణ ఆలయాన్ని తీసివేసి నూతన ఆలయాన్ని గ్రామ సర్పంచి మరియు ప్రజల సహకారంతో ఈ పునర్ ప్రతిష్ట వ్యవహారాన్ని కార్యక్రమాన్ని నిర్వహించమని గ్రామ సర్పంచ్ అఖిల కుమార్ తెలియజేశారు ఈ ప్రతిష్ట కార్యక్రమంలో ఉప సర్పంచ్ మారం రాంచంద్రా రెడ్డి,మాజీ సర్పంచ్ లు మారం రాం రెడ్డి,మోతె రాజమౌళి, మాజీ ఉప సర్పంచ్ గజ్జి శ్రీనివాస్ ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ,వార్డ్ సభ్యులు వేశాల కృష్ణ, ఎలుకటి ఎల్లయ్య, ఉడుత సుగుణ,మైస సదానందం, చిలుక లక్ష్మి, మోతె అశ్విని గ్రామస్తులు జెట్టి చంద్రయ్య,జెట్టి మహేందర్, మేడిపెల్లి కుమారస్వామి, గజ్జి రాజయ్య, ఇప్పకాయల శ్రీనివాస్, పూరెళ్ల సాయిలు, బండారి ఓదేలు మారం ధర్మా రెడ్డి, ఎలుకటి జంపయ్య, ఎలుకటి సమ్మయ్య, మేర్గు సదానందం, ఎలుకటి సమ్మయ్య బండారి ఐలయ్య, బండారి ఓదెల మల్లు, పెద్దవేన మధునయ్య ఎలుకటి కుమార్,బండారి మధునయ్య, ఎలుకటి సారయ్య, చిలుక రమేష్, మెడిపెల్లి మొగిలి, మెడిపెల్లి రవీందర్, ఇచ్చాంతులు కృష్ణ,జక్కుల మధునయ్య, జక్కుల రవీందర్, నస్పూరి అనిల్, బండారి కృష్ణ కుమార్, నస్పూరి మల్లయ్య, నడిగోటి రాజయ్య తదితరులు పాల్గొన్నారు..

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**-నిర్మాణదారుల సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలి.**
**-జిల్లాలో 2,984 ఇళ్లు పూర్తి.**
**-అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సమీక్ష.**






రాజన్న సిరిసిల్ల, జూన్ 24 ( వుదయం ప్రతినిధి ): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, ఇంటి నిర్మాణ పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి హౌసింగ్ పీడీ, డీఆర్డీఓ, మైనింగ్ శాఖ అధికారులతో కలిసి జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 7,367 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, వాటిలో 5,823 ఇళ్లకు ముగ్గు పోయగా, 5,054 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయికి, 4,406 ఇళ్లు గోడల దశకు, 4,091 ఇళ్లు స్లాబ్ స్థాయికి చేరుకున్నాయని, 2,984 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు. ముగ్గు పోసిన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలని, బేస్‌మెంట్ దశలో ఉన్న ఇళ్లను గోడల స్థాయికి, అక్కడి నుంచి స్లాబ్ దశకు, అనంతరం పూర్తిస్థాయిలో నిర్మాణాలు పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ప్రతి ఎంపీడీఓ రోజువారీగా ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని పర్యవేక్షించాలని, మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇటుకలు, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మేస్త్రీలు, వడ్రంగులు, ఇతర కార్మికుల వివరాలను లబ్ధిదారులకు అందుబాటులో ఉంచి నిర్మాణాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. నిర్మాణాల పురోగతికి సంబంధించిన ఫొటోలను హౌసింగ్ ఏఈలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో విడతల వారీగా నిధులు జమ అవుతున్నాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక కొరత ఎక్కడా లేదని స్పష్టం చేసిన కలెక్టర్, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కుంభకోణంలో బీఆర్ఎస్ నేతల హస్తం ఉందా..?

**--చల్మెడ అనుచరుడి అల్లుడే ప్రధాన నిందితుడని కాంగ్రెస్ ఆరోపణ.**
**--విప్ ఆది శ్రీనివాస్‌పై దుష్ప్రచారం మానుకోవాలి.**
**--వేములవాడలో కాంగ్రెస్ నాయకుల మీడియా సమావేశం.**



వేములవాడ, జూన్ 24 ( వుదయం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో వెలుగుచూసిన రూ.91 లక్షల ధాన్యం కుంభకోణంలో బీఆర్ఎస్ నాయకుల ప్రమేయంపై సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై జరుగుతున్న ఆరోపణలను ఖండిస్తూ బుధవారం వేములవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో జరిగిన ధాన్యం కుంభకోణంపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టారని, దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారని తెలిపారు. అయితే ఈ వ్యవహారాన్ని రాజకీయ రంగు పులుముతూ విప్ ఆది శ్రీనివాస్‌ను లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 13 లారీల ధాన్యం అక్రమ రవాణా వ్యవహారంలో 10 లారీల విక్రయాలకు సంబంధించి చేపూరి మధుకర్ అనే వ్యక్తి పేరు విచారణలో వెలుగుచూసిందని పేర్కొన్నారు. ఆయన రుద్రంగి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాడిశెట్టి ఆనందం అల్లుడని తెలిపారు. మధుకర్ ద్వారా ఐదు లారీల ధాన్యాన్ని సిద్ధిపేట ప్రాంతంలో, మరో ఐదు లారీలను ఆంధ్రప్రదేశ్‌లో విక్రయించినట్లు విచారణలో తేలిందని ఆరోపించారు. మాడిశెట్టి ఆనందం బీఆర్ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావుకు అత్యంత సన్నిహితుడని, ఈ నేపథ్యంలో కుంభకోణంపై బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో చల్మెడ పాత్ర ఏమైనా ఉందా అనే అనుమానాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్‌పై ఉందన్నారు. విప్ ఆది శ్రీనివాస్ ఎలాంటి ఒత్తిళ్లకు తావివ్వకుండా పోలీసు, రెవెన్యూ అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి విచారణ జరిపించారని పేర్కొన్నారు. తప్పు చేసిన వారు ఎవరైనా చట్టం ముందు సమానమే అన్న విధానంతో ప్రభుత్వం వ్యవహరించిందని తెలిపారు. ప్రజలకు చేరువగా ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్న ఆది శ్రీనివాస్ రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకే ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలకు పాల్పడుతున్నాయని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి, కళికోట, సూరమ్మ చెరువు, మిడ్ మానేరు పరిసర ప్రాంతాల అభివృద్ధి తదితర కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో రైతుల అవసరాలకు అనుగుణంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, అభివృద్ధి పనులను అడ్డుకునేందుకే కొందరు రాజకీయ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, తగిన సమయంలో తగిన సమాధానం ఇస్తారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూము మధు, మున్సిపల్ వైస్ చైర్మన్ నారాల శేఖర్,మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే మా ధ్యేయం!



**- బోనాల పండుగలో ప్యాడ్ బ్యాండ్లకు అనుమతి ఇవ్వాలి డీజీపీకి వినతి**

**ముషీరాబాద్, జూన్ 24(వుదయం)**

తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్ ని ఈరోజు కలిసి బోనాల పండుగల సందర్భంగా ప్యాడ్ బ్యాండ్లు, డప్పు బ్యాండ్లకు అనుమతి ఇవ్వాలని, బ్యాండ్ కళాకారుల ఉపాధిని పరిరక్షించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఆషాఢ మాసంలో అత్యంత వైభవంగా నిర్వహించే బోనాల పండుగలకు డప్పు, బ్యాండ్ వాయిద్యాలు, పోతరాజుల నృత్యాలు, జానపద కళారూపాలు అంతర్భాగమని తెలిపారు. బోనాల పండుగలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు.చారిత్రకంగా బోనాల పండుగలు ప్రజల విశ్వాసాలకు, ఆధ్యాత్మిక భావాలకు ప్రతీకగా కొనసాగుతున్నాయని, మహిళలు బోనం ఎత్తుకొని ఆలయాలకు వెళ్లే ఊరేగింపుల్లో డప్పు, బ్యాండ్ కళాకారులు, ఒగ్గు కథ కళాకారులు, పోతరాజులు కీలక పాత్ర పోషిస్తారని వివరించారు. ఈ కళారూపాల వల్లే పండుగకు ప్రత్యేక శోభ చేకూరుతుందని చెప్పారు.అయితే ఇటీవల సౌండ్ పొల్యూషన్ నియంత్రణ పేరుతో జారీ చేసిన జీవో నెం. 227 అమలులో భాగంగా ప్యాడ్ బ్యాండ్లను డీజేలతో సమానంగా పరిగణిస్తూ అనేక ప్రాంతాల్లో వాహనాలను సీజ్ చేయడం, బ్యాండ్ మాస్టర్లపై కేసులు నమోదు చేయడం వల్ల వేలాది మంది కళాకారుల కుటుంబాలు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రజల ఆరోగ్యం, ప్రశాంతతను దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవడం సమంజసమేనని, అయితే సంప్రదాయ కళాకారుల జీవనోపాధి దెబ్బతినకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రధాన డిమాండ్లు:బోనాల పండుగల సందర్భంగా ప్యాడ్ బ్యాండ్లకు ప్రత్యేక అనుమతులు ఇవ్వాలి.సౌండ్ పొల్యూషన్ నియంత్రణ కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి.శబ్ద పరిమితుల (డెసిబెల్ స్థాయిల)పై స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి.రాత్రి 11 గంటల తర్వాత బ్యాండ్ వాయిద్యాలను నిలిపివేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలి.జీవో నెం. 227 వల్ల బ్యాండ్ కళాకారుల ఉపాధి దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి. బ్యాండ్ కళాకారులపై అనవసర కేసులు, వేధింపులు నిలిపివేయాలి.ఈ వినతిపై స్పందించిన డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్ గారు బ్యాండ్ కళాకారుల సమస్యలను పరిశీలించి, చట్టపరమైన పరిధిలో సాధ్యమైన పరిష్కార మార్గాల కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజ్ నాగరాజు, నగర కార్యదర్శి వేముల శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అశ్వాల హనుమంత్, నగర సలహాదారు రాజు తదితరులు పాల్గొన్నారు.

# రానున్న కాలమంతా ఉద్యమాలదే: సీపీఐ

**- ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు : జిల్లా కార్యదర్శి ఫయాజ్**

**నాగర్ కర్నూల్,జూన్ 24 (వుదయం ప్రతినిధి):**

రానున్న కాలమంతా పోరాటాలది, ఉద్యమాలదేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. బాల నరసింహ, జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఇకపై నిరంతర పోరాటాలను ముమ్మరం చేస్తామని తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం చాలా కాలం వేచి చూశామని, కానీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న విధానాలు ప్రజలను సంతృప్తి పరచడం లేదని విమర్శించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలయ్యే వరకు పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో, రాష్ట్రంలో ఎటు చూసినా సమస్యలే ఉన్నాయని, దేశంలో ఆర్థికపరమైన ఎమర్జెన్సీ రాబోతుందన్న హెచ్చరికలు వస్తున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. రానున్న విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు ఆర్థిక మేధావులతో కమిటీలు వేసి చర్చించాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, మహిళలకు 2500 రూపాయలు, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు వంటి హామీలను తక్షణమే అమలు చేయకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు, ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఏ. కేశవులు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యుడు వి. వెంకటయ్య, జిల్లా



కార్యవర్గ సభ్యులు టి. నరసింహ, ఆర్. ఇందిరా, జిల్లా సమితి సభ్యులు బండి లక్ష్మీపతి, కృష్ణాజి, మర్యాద వెంకటయ్య, తుమ్మల శివుడు, బొల్లెద్దుల శ్రీనివాసులు, టి. కిరణ్ కుమార్, రవీందర్, బాలమురళి, బి. శ్రీనివాసులు, బి. వెంకటమ్మ, సయ్యద్ ఖాజా మొయినొద్దీన్, ఎండి. కుతుబుద్దీన్, పి. గోపాల్, మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వెట్టిచాకిరి, అక్రమ రవాణాపై ఉక్కుపాదం



**- పోలీసు అధికారులు, సిబ్బందికి అవగాహన శిక్షణ : ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ఆధ్వర్యంలో శిబిరం**

**నాగర్‌కర్నూల్, జూన్ 24 (వుదయం బ్యూరో):**

అమాయక, పేద ప్రజల శ్రమను దోపిడీ చేస్తూ వారిని బానిసలుగా మార్చే ముఠాలు, యజమానులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ హెచ్చరించారు. వెట్టిచాకిరి, మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంస్థ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బందికి 'మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి' అంశంపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్లు మేరకమని, రవితేజ పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు.అడ్వకేట్ మేరకమని మాట్లాడుతూ ఇటుక బట్టీలు, రైస్ మిల్లులు, బొగ్గుబట్టీలు, వ్యవసాయ క్షేత్రాల్లో చిక్కుకుపోయిన బాల కార్మికులను వెట్టిచాకిరి నుంచి రక్షించే విధానం, మహిళలు, పిల్లలను అక్రమ రవాణా నుంచి కాపాడే మార్గాలను వివరించారు. పోలీసులు కోర్టులతో కలిసి పనిచేసి నేరస్తులకు శిక్షలు పడేలా చూడాలని, రక్షించబడిన వారికి మానసిక ధైర్యంతో పాటు సమాజంలో గౌరవంగా బతకడానికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు.ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమంగా కార్మికులను బంధించి పనిచేయించడం, చిన్న పిల్లలతో ప్రమాదకర పనులు చేయించడం వంటివి తమ దృష్టికి వస్తే వెంటనే జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు, సీసీఎస్ సీఐ శంకర్, జిల్లాలోని ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీస్ స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో గలిగిన విద్య అవసరం.....



**-ప్రీ ప్రైమరి పాఠశాలలను ప్రారంభించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

**వుదయం న్యూస్ -శివ్వంపేట,**

చిన్నారులకు ప్రీ ప్రైమరి విద్యతో భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు.బుధవారం మండలంలోని నవాబ్ పేట, చిన్నగొట్టిముక్ల, ఉసిరికపల్లి, దొంతి గ్రామాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరి పాఠశాలలను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించడం జరుగుతుందని, విద్యార్థులు బాల్యం నుంచే మంచి విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ చాలా అవసరం అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా చిన్నారుల విద్యకు పూర్తి సహకారం అందించాలని అన్నారు. చిన్నారులకు మొబైల్ను దూరంగా ఉంచాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయివేట్కు ధీటుగా మెరుగైన విద్యను అందించడం జరుగుతుందని గుర్తుచేశారు. అంతకుముందు చిన్నారులకు అక్షరభ్యాసం చేయించి వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంధాలయ మాజీ ఛైర్మన్ చంద్రాగౌడ్, ఆత్మకమిటి మాజీ ఛైర్మన్ గౌరె వెంకట్రెడ్డి, సర్పంచ్ లు తేజశ్వినిరాజేందర్ నాయక్ , నారాయణరావు, మర్రి సుజాతకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు యాదాగౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మర్రి మహేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ పాపయ్యచారీ, మాజీ ఎంపీటీసీ నువ్వుల దశరథ, నరేందర్, ఎంఈఓ బుచ్యానాయక్, ఎంపీఓ తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

# అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు



**- ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య : పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ లక్ష్యం - ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి**

**నాగర్ కర్నూల్, జూన్ 23 (వుదయం ప్రతినిధి)**

"అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తాం, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తాం. పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం" అని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం నాడు జిల్లా లోని నాగర్కర్నూల్ మండలంలో సుడిగాలి పర్యటన చేపట్టిన ఎమ్మెల్యే, నూతన ఇందిరమ్మ ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. పలువురి ప్రతానం కార్యక్రమాలు, వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను, కుటుంబాలను ఆశీర్వదించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులతో ముచ్చటించారు. ఉచిత యూనిఫామ్‌లు, షూస్ పంపిణీపై ఆరా తీసి నాణ్యమైన విద్య, వసతులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా దేవాలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలించి వెంటనే పనులు మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు. పెద్దముద్దునూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు సర్పంచ్ లక్ష్మీ కర్ణాకర్, ఉప సర్పంచ్ వెంకటయ్య, మాజీ ఎంపీపీ కోటయ్య, ఇంద్రారెడ్డి, సర్పంచ్ రాము, ఉప సర్పంచ్ రేణుక, శ్రీనివాస్ రావు, స్వామి, కృష్ణ, టౌన్ అధ్యక్షుడు జక్కా రాజు, కౌన్సిలర్లు వసంత సంతోష్ గౌడ్, నరసింహ రెడ్డి, నిజాముద్దీన్, శంకర్, శాంతయ్య, కృష్ణ రెడ్డి, తిరుపతయ్య, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 30లోగా ఎల్పీజీ ఈకేవైసీ

**- సబ్సిడీ కొనసాగాలంటే తప్పనిసరి : డిస్ట్రిబ్యూటర్లతో సమీక్షలో స్పష్టం**

**నాగర్ కర్నూల్, జూన్ 24 (వుదయం బ్యూరో):**



డీబీటీఎల్‌పహల్, పీఎంయూవై, దీపం, మహాలక్ష్మి పథకాల కింద గ్యాస్ కనెక్షన్లు పొందిన వినియోగదారులందరూ ఈ నెల 30లోగా బయోమెట్రిక్ ఆధార్ ఆథెంటికేషన్ (BAA), ఈకేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అదనపు కలెక్టర్ (పౌర సరఫరాలు) స్పష్టం చేశారు. గడువులోగా పూర్తి చేయకుంటే సబ్సిడీ ప్రయోజనాలు నిలిచిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ సేల్స్ అధికారులు, జిల్లా ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న వినియోగదారులను గుర్తించి ఆధార్ సీడింగ్, ఈకేవైసీ, BAA ప్రక్రియ పూర్తయ్యే వరకు డిస్ట్రిబ్యూటర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.పెండింగ్ వినియోగదారుల జాబితాలు సిద్ధం చేసి ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్, ఫోన్ కాల్స్, గ్రామాల్లో చాటింపు, ఇంటింటి ప్రచారం ద్వారా అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ వినియోగదారులు, దీపం, పీఎంయూవై, మహాలక్ష్మి, డీబీటీఎల్ లబ్ధిదారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, కమ్యూనిటీ హాళ్లలో ప్రత్యేక ఈకేవైసీ శిబిరాలు ఏర్పాటు చేసి సిబ్బంది, బయోమెట్రిక్ పరికరాలతో సేవలు అందించాలన్నారు. ప్రతి రోజు పురోగతి నివేదికలు సమర్పించాలని, గడువులోగా 100% లక్ష్యం సాధించాలని డిస్ట్రిబ్యూటర్లకు సూచించారు.వినియోగదారులందరూ తమ డిస్ట్రిబ్యూటర్లను సంప్రదించి జూన్ 30, 2026లోగా ప్రక్రియ పూర్తి చేసుకోవాలని అదనపు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీసీఎస్ఓ, చమురు కంపెనీల సేల్స్ అధికారులు, జిల్లా డిస్ట్రిబ్యూటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బిజెపి నేత తల్లిని పరామర్శించిన ఎంపీ అరుణ



**నారాయణపేట టౌన్ జూన్ 24(వుదయం ప్రతినిధి)**

బిజెపి రాష్ట్ర నాయకులు,మాజీ జిల్లా బిజెపి అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులు తల్లి వెంకటమ్మ 93 ఏళ్ల వయసులో అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని బుధవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. బుధవారం నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో పాఠశాల అదనపు గదుల ప్రారంభోత్సవం నిర్వహించారు.పగుడాకుల శ్రీనివాసులు తల్లి అనారోగ్యం విషయం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

# పలుగుతాండ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ జూన్ 24(వు దయం)**



నారాయణ ఖేడ్ మండల పరిధిలోని పలుగు తాండ పాఠశాలను నారాయణ ఖేడ్ శాసనసభ్యులు పట్లోల సంజీవరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి పాఠశాల స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలను పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు . ప్రభుత్వ పాఠశాలలో చాలా మంచిగా చదువు ఉంటుందని తల్లిదండ్రులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు రమేశ్ చౌహాన్, ఉపాధ్యాయులు పుండ్లిక్, దత్తురామ్, సర్పంచ్ కిషన్ నాయక్ నాయకులు జైపాల్ యాదవ్, దత్తు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలి




**- ఎంపీ సురేష్ షెట్కర్ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి::**
**- ఎంపీ రఘునందన్ రావు**

**సంగారెడ్డి, జూన్ 24: -వు దయం జిల్లా ప్రతి నిధి**

ప్రజలకు ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ సూచించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ సురేష్ షెట్కర్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం నిర్వహించారు. మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావుతో కలిసి కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల పనుల పురోగతిని సమీక్షించారు. సమావేశంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపడుతున్న పనుల్లో జాప్యాన్ని నివారించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అమృత్ పథకం కింద కొనసాగుతున్న పనులను వేగవంతం చేయడంతో పాటు కొత్తగా ఏర్పడిన కోహిర్ మున్సిపాలిటీకి అవసరమైన తాగునీటి కనెక్షన్ల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.రోడ్లు మరియు భవనాల శాఖ, జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనుల్లో ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. పీఎం స్వనిధి పథకం కింద అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు.వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేసి, డ్రోన్ సాంకేతికత వినియోగంపై అవగాహన కల్పించాలని, ప్రతి గ్రామంలో మహిళా సంఘాలకు డ్రోన్లు అందించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద చెరువుల సుందరీకరణ పనులను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు నారింజవాగు సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులను పారదర్శకంగా, సమర్థవంతంగా వినియోగిస్తూ అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని అధికారులను కోరారు. జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు.ముత్తంగి నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని జాతీయ రహదారుల సంస్థ అధికారులను ఆదేశించారు. పెద్దాపూర్ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి-పటాన్‌చెరు మార్గంలో అవసరమైన రహదారి అభివృద్ధి పనులకు సీఆర్ఎఫ్ కింద ప్రతిపాదనలు పంపాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు.పీఎం కుసుం, పీఎం సూర్యఘర్ యోజన పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించి రైతులు, ప్రజలు సౌర విద్యుత్ వినియోగం వైపు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టరేట్ భవనంలో కూడా సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించారు.జిల్లాకు మంజూరైన 12 ఆహార ధాన్య నిల్వ గోదాముల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు. సంగారెడ్డి పటాన్చెరు రింగ్ రోడ్డు పరిసర ప్రాంతంలో ఆధునిక చేపల మార్కెట్ ఏర్పాటు కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్యలు తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి జిల్లా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ టీబీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా తండాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, కార్యాలయాలు, నివాస మరియు వాణిజ్య భవనాలలో పీఎం సూర్యఘర్ యోజన కింద సోలార్ వ్యవస్థల ఏర్పాటుపై విస్తృత అవగాహన కల్పించి ప్రోత్సహిస్తామని చెప్పారు.

ఈ సమావేశంలో డీఆర్‌డీఓ జ్యోతి, జిల్లా స్థాయి అధికారులు, జాతీయ రహదారుల సంస్థ ప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, దిశా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేపర్ లీకేజీ కి కేరాఫ్ అడ్రస్ కేంద్ర ప్రభుత్వం




**- డిసిసి జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి**

**నారాయణపేట జూన్ 24 (వుదయం ప్రతినిధి**

జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన నీట్ జేఈఈ,వంటి పరీక్షలలో జరుగుతున్న పేపర్ లీకేజీ లకు కేంద్ర ప్రభుత్వం కేరాఫ్ అడ్రస్ గా మారిందని నారాయణపేట జిల్లా డిసిసి అధ్యక్షులు కే ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు. విద్యా వ్యవస్థలోని లోపాలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ విద్యార్థుల పక్షాన నిలబడ్డ రాహుల్ గాంధీ మాటలను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని సివిఆర్ భవన్ లో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజస్థాన్‌లోని కోచింగ్ హబ్ కోటాలో విద్యార్థులతో నిర్వహించిన ఛాత్ రోం కి బాత్ (విద్యార్థుల స్వరం) ముఖాముఖి సమావేశంలో ఆయన విద్యార్థుల మానసిక ఒత్తిడి, సమస్యలపై చర్చించారని వెల్లడించారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీ పైగత పదేళ్ల బిజెపి ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా వివిధ పరీక్షలకు సంబంధించి దాదాపు 89 సార్లు పేపర్లు లీక్ అయ్యాయని తెలిపారు. ఇది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందని రాహుల్ గాంధీ మండిపడ్డారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం విద్యపై ఏడాదికి దాదాపు 1.40 కోట్లు ఖర్చు చేస్తుంటే, దేశవ్యాప్తంగా కేవలం నీట్ పరీక్ష కోసమే విద్యార్థుల తల్లిదండ్రులు కోచింగ్, ఇతర రూపాల్లో 1.32 కోట్లు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే జేఈఈ కి 1.3 కోట్లు, ఆర్ఆర్‌బీ కి 50,వేల కోట్లు, యూపీఎస్సీ కి రూ. 25,వేల కోట్ల చొప్పున తల్లిదండ్రులు భరిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత విద్యా వ్యవస్థ కేవలం రిజెక్షన్ సిస్టమ్ (వంద మంది రాస్తే ఒక్కరికే సీటు రావడం, మిగిలిన 99 మందిని తిరస్కరించడం) లాగా మారిందని, దీని స్థానంలో విద్యార్థులకు నచ్చిన చదువు చదువుకునే స్వేచ్ఛ, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మార్పులు రావాలని ఆయన ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చేస్తోందని ప్రశాంత్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అందరికీ ఒకే చోట అంతర్జాతీయ స్థాయి వసతులతో కూడిన విద్యను అందించేందుకు ప్రతి నియోజకవర్గానికి ఒక 'ఇంటిగ్రేటెడ్ స్కూల్' ను నిర్మిస్తున్నారని అన్నారు. నారాయణపేట జిల్లాలో ఇప్పటికే రెండు స్కూళ్లు (నారాయణపేట, మక్తల్) మంజూరై నిర్మాణ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రతి మండలంలో అధునాతన సైన్స్ ల్యాబ్‌లు, లైబ్రరీ, కంప్యూటర్ సెంటర్లతో కూడిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌స్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రారంభిస్తోందని అన్నారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా కార్పొరేట్ వసతులను ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సలీం, పట్టణ అధ్యక్షుడు పెంకు గౌడ్, మండల అధ్యక్షుడు కోట్ల రవీందర్ రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విజ్ఞప్తి



**సంగారెడ్డి, జూన్ 24:వు దయం.**

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జవహర్ నవోదయ విద్యాలయాన్ని తక్షణమే ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్కు లేఖ రాశారు.ఈ లేఖను బుధవారం నిర్వహించిన దిశా సమావేశంలో కలెక్టర్‌కు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం 2024లో తెలంగాణ రాష్ట్రానికి మంజూరు చేసిన ఏడు కొత్త జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఒకటి సంగారెడ్డి జిల్లాకు కేటాయించబడిందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు విద్యాలయం ప్రారంభం కాకపోవడంతో జిల్లా విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.సంగారెడ్డి మండలం, కంది మండలం, కొండాపూర్ మండలాల పరిధిలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని పేర్కొంటూ, 2026-27 విద్యా సంవత్సరంలోనే విద్యాలయం ప్రారంభించేందుకు అవసరమైన భూకేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్‌ను కోరారు.జిల్లా విద్యార్థులకు నాణ్యమైన, ఉచిత వసతి విద్య అందించే జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు వల్ల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర స్థాయి పోటీలలో మెరిసిన అయిజ జడ్పిహెచ్ఎస్ ఆణిముత్యం

**అయిజ జూన్ 24 (వుదయం ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి రవీంద్ర రాష్ట్ర స్థాయి మోడల్ యుఎన్ఓ లో భాగంగా నిరాయుధీకరణ , అంతర్జాతీయ భద్రత కమిటీ అంశంలోని వ్యాసరచన పోటీలలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుపొంది అయిజ పేరును రాష్ట్ర హెడ్మాస్టర్ రాములు మాట్లాడుతూవిద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, ఇలాంటి సృజనాత్మక అంశాలపై దృష్టి పెట్టడం ద్వారా నైపుణ్యాలు మెరుగుపడతాయని తెలిపారు. రవీంద్ర ద్వితీయ బహుమతి గెలుపొందినందుకు న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవనాన్ని ఉచితంగా సందర్శించడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. విద్యార్థి గెలుపుకు మార్గదర్శకులు, గైడ్ టీచర్ పాల్వాయి లక్ష్మి నారాయణ కు ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, పాఠశాల సిబ్బంది, అయిజ మండల ప్రజలు అభినందించారు.

# రాష్ట్ర స్థాయి పోటీలలో మెరిసిన అయిజ జడ్పిహెచ్ఎస్ ఆణిముత్యం

**అయిజ జూన్ 24 (వుదయం ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి రవీంద్ర రాష్ట్ర స్థాయి మోడల్ యుఎన్ఓ లో భాగంగా నిరాయుధీకరణ , అంతర్జాతీయ భద్రత కమిటీ అంశంలోని వ్యాసరచన పోటీలలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుపొంది అయిజ పేరును రాష్ట్ర స్థాయిలో నిలిపారు. బుధవారం చేతుల మీదుగా రవీంద్ర బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా హెడ్మాస్ట గెలుపుకు మార్గదర్శకులు, గైడ్ టీచర్ పాల్వాయి లక్ష్మి నారాయణ కు ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, పాఠశాల సిబ్బంది, అయిజ మండల ప్రజలు అభినందించారు.

# నగర సరుకు రవాణా వ్యవస్థ బలోపేతానికి సిటీ లాజిస్టిక్ ప్లాన్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.




వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి జూన్ 24.నగరంలో సరుకు రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు రూపొందిస్తున్న సిటీ లాజిస్టిక్ ప్లాన్ (సీఎల్పీ) అమలుపై బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర పరిధిలో సరుకు రవాణాకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులు, ట్రాఫిక్ సమస్యలు, రవాణా సౌకర్యాలు, గిడ్డంగులు, మార్కెట్లు, లాజిస్టిక్ అవసరాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. సిటీ లాజిస్టిక్ ప్లాన్ రూపకల్పనకు అవసరమైన సమాచారాన్ని సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో అందించాలని సూచించారు. నగరాభివృద్ధి, వ్యాపార కార్యకలాపాల విస్తరణ, రవాణా ఖర్చుల తగ్గింపు, సరుకు రవాణా సామర్థ్య పెంపునకు సీఎల్పీ దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో రెవెన్యూ, రవాణా, ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్, పౌర సరఫరాలు, పరిశ్రమల శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయలక్ష్మి, జీఎం ఇండస్ట్రియల్ నరసింహమూర్తి, డిప్యూటీ డైరెక్టర్ (సీ డ ఈపీ) హైదరాబాద్ సుధీన్ పాల్, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి చంద్రకళతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఛలో కొడంగల్ విజయవంతం చేయాలి: వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు పిలుపు

**కాలా పరిమితి లేని కమిటీల పేరుతో ఉద్యమకారుల జీవితాలతో చెలగాటమాడితే చూస్తూ ఊరుకోబోమని ప్రభుత్వం హెచ్చరించిన ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ముదురకోల నాగరాజు**



పర్వతగిరి, జూన్ 24 ( వుదయం ప్రతినిధి ) :వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ఎలాంటి కాలయాపన లేకుండా ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ నెల 28వ తేదీ ఆదివారం నాడు నిర్వహించ తలపెట్టిన "ఛలో కొడంగల్" కార్యక్రమాన్ని ఉద్యమకారులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

ఈనెల 28 ఆదివారం రోజున చేవెళ్ల వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహా ప్రదర్శనకు వరంగల్ జిల్లా నుండి వంద మంది తగ్గకుండా భారీ ఎత్తున తరలివెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కమిటీ, తన నివేదికను త్వరగా ముఖ్యమంత్రికి సమర్పించాలని చల్లా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ముదురకోల నాగరాజు మాట్లాడుతూ ఫోరం నిరంతర కృషి ఫలితంగానే ఈ కమిటీ ఏర్పాటయిందని గుర్తు చేస్తూ.. కాలా పరిమితి లేని కమిటీల పేరుతో ఉద్యమకారుల జీవితాలతో చెలగాటమాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వం ఇకనైనా ఆలస్యం చేయకుండా హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో ఉద్యమకారులు మరో ఉధృత పోరాటానికి సిద్ధమౌతారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండల అధ్యక్షులు గరుగు రాజు,బుర శ్యామ్ గౌడ్,బొట్ల మధు,ఆకారపు రాములు,బైరి అశోక్, కత్తుల శ్రీనివాస్, గఫార్, వడ్లకొండ రమేష్, మేరుగు వెంకన్న,సంతోష్ బరిగెల విజయ,అర్షం కూమార్,బుద్దె నాగరాజు,జంగం రమేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# డిసిసి బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన.

**కళాజాతర బృందంచే అవగాహన.**

**బ్యాంకు ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ రకాల రుణాలపై అవగాహన.**

**బ్రాంచ్ మేనేజర్ కాసుల జయప్రకాష్,**



ఖానాపురం, జూన్ 24 (వుదయం ప్రతినిధి):ఆర్థిక అక్షరాస్యతపై డిసిసి బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రజలకు కళా జాతర బృందంచే అవగాహన కల్పిస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ కాసుల జయప్రకాష్ తెలిపారు. మండలంలోని బుదరావుపేట గ్రామంలోని వరంగల్ డీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో నాబార్డ్ వారి ఆర్థిక సహకారంతో ఆర్థిక అక్షరాస్యతపై ఎఫ్ఎల్సి నుక్కడ్ నాటకం వై రమేష్ కళాజాతర బృందంచె ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించినట్లు బ్రాంచ్ మేనేజర్ తెలుపుతూ, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, కేవైసీ, ఆర్ఈ కేవైసీల గురించి ఖాతాదారులకు రైతులకు ప్రజలకు వివరిస్తూ, బ్యాంకు ద్వారా ప్రజలకు రైతులకు వ్యాపారస్తులకు అందిస్తున్న అన్ని రకాల రుణ సౌకర్యాలపై అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ బీమా పథకాలలో చేరి ఆర్థిక భద్రతను పొందాలని బ్రాంచ్ మేనేజర్ రైతులకు ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ గంప స్రవంతి, ఫీల్డ్ ఆఫీసర్ వేముల నాగరాజు, సొసైటీ సీఈవో ఆంజనేయులు, స్టాఫ్ అసిస్టెంట్ మేరగు రాజు సిబ్బంది రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమిష్టి భాగస్వామ్యం, అధికారుల కృషితోనే "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" విజయవంతం.

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

నిర్మల్ జిల్లా 24 జూన్ 2026 (వుదయం ప్రతినిధి) ప్రజలు, ప్రజా ప్రతినిధుల సమిష్టి భాగస్వామ్యం, అధికారుల కృషితోనే "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పారిశుధ్య కార్యక్రమాలు, గ్రామ, వార్డు సభలు, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్, అరైవ్ అలైవ్ కార్యక్రమం, రైతు, మహిళా శిశు సంక్షేమ, విద్యా ఆరోగ్య, సంస్కృతిక, పర్యావరణ వారోత్సవాల పేరిట విస్తృత కార్యక్రమాలు చేపట్టామన్నారు. గ్రామ, వార్డు సభలు నిర్వహించి అధికారులంతా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించినట్లు వివరించారు. దీర్ఘ కాలికంగా పెండింగ్లో ఉన్న అంశాలను పరిష్కరించినట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంటల దిగుబడి అధికంగా వచ్చిందని, అధికారుల సమన్వయంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని పంటలను కొనుగోలు చేశామన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం నిల్వ ఉంచేందుకు అవసరమైన గోదాములను నిర్మిస్తామని చెప్పారు. రెవెన్యూ కు సంబంధించిన అంశాలన్నీ తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే,భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 2బీహెచ్‌కే ఇళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.



వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి జూన్ 24.

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం గన్నారం, కాట్రపల్లి గ్రామంలోని 2బీహెచ్‌కే గృహాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈ సందర్భంగా గృహాల నిర్మాణ స్థితి, మౌలిక వసతులు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2బీహెచ్‌కే ఇళ్ల కేటాయింపులో పారదర్శకత పాటించాలని, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఇందిరమ్మ ఇండ్ల నోడల్ అధికారి, జెడ్పీ సీఈవో రాంరెడ్డిని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హుల జాబితాను రూపొందించి, నిజమైన నిరుపేదలకు గృహాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి వివక్షకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, వరంగల్ ఆర్డీవో సుమ , రాయపర్తి తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 03వ వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం పట్ల హర్షం



పరకాల, జూన్ 24: (వుదయం ప్రతినిధి): పరకాల మున్సిపాలిటీ 03వ వార్డు గడ్డంవాడలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణం పూర్తికావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గత 13 ఏళ్లుగా డ్రైనేజీ, రహదారి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్న కాలనీవాసులకు ప్రజా ప్రభుత్వం, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ సమస్యలకు పరిష్కారం లభించిందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్, సమన్వయ కమిటీ సభ్యుడు పొరండ్ల సంతోష్ మాట్లాడుతూ, గతంలో పరిష్కారం కాని సమస్యలు ప్రస్తుతం ఎమ్మెల్యే చొరవతో నెరవేరాయని తెలిపారు. అభివృద్ధి పనులకు సహకరించిన ఎమ్మెల్యేకు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం శివకుమార్ మాట్లాడుతూ, పరకాల అభివృద్ధికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ కృషి చేస్తున్నారని కొనియాడారు. వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న కౌన్సిలర్ పొరండ్ల మౌనిక వేణును అభినందించారు.

కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ సూర్నేని స్వామిరావు, యాపశెట్టి సమ్మన్న, ఓంకారం శ్రీధర్ రాజు, రావుల అశోక్, గడ్డం రాజు, గడ్డం దేవేందర్, బాసాని సుమన్, శ్రీరాముల రాజేష్, గడ్డం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రైనింగ్ పేరుతో వ్యాపారులపై ఒత్తిడి తగదు

**: ఛాంబర్ ఆఫ్ కామర్స్**




ఆదిలాబాద్, జూన్ 24:ఫుడ్ సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల పేరుతో వ్యాపారులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దినేష్ మాటోలియా అన్నారు.

బుధవారం ఆదిలాబాద్‌లోని ఛాంబర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ నాయక్ తర్యాజీ తన ఏజెంట్ల ద్వారా వ్యాపారుల నుంచి శిక్షణ ఫీజుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు తమకు అందాయని తెలిపారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న వ్యాపారులను కూడా శిక్షణ తీసుకోవాలని ఒత్తిడి చేస్తూ, ఫీజులు చెల్లించాలని కోరుతున్నట్లు ఆరోపించారు.

ఇప్పటి వరకు సుమారు 1,804 మంది వ్యాపారుల నుంచి రూ.2,000 చొప్పున దాదాపు రూ.36 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. ఈ నిధులు ప్రభుత్వ ఖాతాలకు జమ అవుతున్నాయా లేదా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

శిక్షణ పేరుతో వసూలు చేసిన మొత్తాన్ని సంబంధిత వ్యాపారులకు తిరిగి చెల్లించాలని, లేకుంటే ప్రభుత్వానికి జమ చేయాలని కోరారు. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ స్థాయిలో ఈ అంశంపై సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసిందని, అవసరమైతే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

వ్యాపారులకు శిక్షణ అవసరమైతే ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇచ్చి, అవసరమైన సర్టిఫికెట్లు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కందుల రవీందర్, తానాజీ నిక్కమ్, అమిత్ జీవాని, యోగేష్ ఉపలంచి తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కు దూరంగా ఉండాలి.ఎస్.ఐ ఉదయ్ కిరణ్



జన్నారం,జూన్24(వుదయం విలేకరి )విద్యార్థులు,యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిసలై తమ జీవితాలను,బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్ఐ జి. ఉదయ్ కిరణ్ అన్నారు. జన్నారం మండలంలోని కలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కు బుధవారం రోజున అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు విద్యార్థుల కు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచిగా చదువుకొని పాఠశాలకు, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల అవగాహన వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి,సర్పంచ్ బొంతల నాగమణి మల్లేష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో కార్యాలయంలో వీడ్కోలు స్వాగత సన్మానాలు



అనంతగిరి: జూన్ 24 వుదయం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆత్మీయ వాతావరణంలో వీడ్కోలు, స్వాగత కార్యక్రమాలు నిర్వహించారు. బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో హరి సింగ్, ఖానాపురం పంచాయతీ కార్యదర్శి అక్షయ్ తేజలకు మండల పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, హరి సింగ్ తన సేవా కాలంలో మండల అభివృద్ధికి కృషి చేశారని, అక్షయ్ తేజ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. వారి భవిష్యత్ సేవా ప్రయాణం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో అబ్దుల్ సుభానీకి, అలాగే పంచాయతీ కార్యదర్శులు సోందు, శ్రీవిద్య, కార్యాలయ సిబ్బంది సీవీ, ఉపేందర్, రామకోటేశ్వరరావులకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. నూతన బాధ్యతల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీవో సుష్మ, ఈసీ వెంకన్న, మండల పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు

**- డవ్ పునరావాస కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ రాజర్షి షా**



- ఆదిలాబాద్, జూన్ 24: వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండి మంచి మార్పుతో నవజీవనం సాగించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. నషా ముక్త్ భారత్ సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం డవ్ పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఆయన, కేంద్రంలోని వివిధ విభాగాలతో పాటు మెడికల్ క్యాంప్, టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో నిర్వహిస్తున్న ఎక్స్-రే క్యాంప్‌ను పరిశీలించారు.

ఈ సందర్భంగా కేంద్రంలోని సిబ్బంది, చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం కేంద్రం విశాలమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని సౌకర్యాలతో మెరుగ్గా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చిన వారు కేవలం 30 రోజుల్లోనే మంచి మార్పు సాధించడం సంతోషకరమని అన్నారు.

కుటుంబం, ముఖ్యంగా పిల్లల విద్యాభవిష్యత్తు కోసం వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించిన కలెక్టర్, డిశ్చార్జ్ అనంతరం మళ్లీ పాత అలవాట్ల బారిన పడకుండా బాధ్యతాయుతమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. వ్యక్తి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా ఉంటుందని చెప్పారు.

అనంతరం పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ డవ్ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు.

కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సాధన, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, వైద్యులు సుమలత, విజయ్, కేంద్రం నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



నాగిరెడ్డిపేట్,వుదయంప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సి. నరేందర్, గోపాల్‌పేట్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. వెంకట్ రామ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని సూచించారు.

క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతును ఏడిపిస్తున్న 'యాప్' గోస!

**డిజిటల్ కష్టాలు వద్దు.. పాస్‌బుక్‌లతోనే యూరియా ఇవ్వాలి**

**గట్టుప్పల్ తహసీల్దార్ ఆఫీస్ ముట్టడి.. రైతు, కార్మిక సంఘాల ఆగ్రహం**

చండూరు - గట్టుప్పల్, జూన్ 24 (వుదయం):ప్రస్తుతం ఫోన్ యాప్ ద్వారా నిర్వహిస్తున్న యూరియా పంపిణీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, పాత పద్ధతిలోనే పట్టాదార్ పాస్‌బుక్కుల ద్వారా నేరుగా రైతులకు యూరియా పంపిణీ చేయాలని రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రైతు, వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం గట్టుప్పల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయా సంఘాల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. యాప్‌ల పేరుతో యూరియా పంపిణీని క్లిష్టతరం చేయడం వల్ల సామాన్య, నిరక్షరాస్యులైన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యల వల్ల సకాలంలో ఎరువులు అందక పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే యాప్ విధానాన్ని పక్కనబెట్టి, రైతులకు సులువుగా ఉండేలా పాస్‌బుక్‌ల ఆధారంగా ఎరువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వ్యవసాయ కూలీల సమస్యలను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన మెమోరాండంను తహసీల్దార్ కార్యాలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం, చాపల మారయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కర్నాటి సుధాకర్, నాయకురాలు రాములమ్మ, వివిధ ప్రజా సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో నే నాణ్యమైన విద్య



**- విద్యా వ్యవస్థలో సమూల మార్పులు**

**- రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు చార కొండ వెంకటేష్**

**వెల్దండ జూన్ 24 (వు దయం )**

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య బోధిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేపట్టినట్లు రాష్ట్ర కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్ పేర్కొన్నారు మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల నర్యాగాని తాండ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసరాలను, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు మరియు ఉపాధ్యాయులను అభినందిస్తూ, పాఠశాలలో జరుగుతున్న విద్యా కార్యక్రమాలను ప్రశంసించారు. అదేవిధంగా ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న వివిధ సౌకర్యాలు, సంక్షేమ పథకాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, నాణ్యమైన విద్యను అందించేందుకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీ ఎస్. చంద్రుడు , గ్రామ సర్పంచ్ శ్రీ ఎస్. రమేష్ నాయక్ , ఉపసర్పంచ్ శ్రీమతి ఆర్. అనిత పంతు నాయక్ , వార్డు సభ్యులు, మాజీ MPTC సభ్యులు శ్రీ ఎం. మోతిలాల్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కె. పంతు నాయక్ , గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీ గోపి , అంజ్య సార్ , అంగన్‌వాడీ టీచర్, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.a

# డ్రగ్స్ డీ-అడిక్షన్ కేంద్రాన్ని సందర్శించి



**- నోటు పుస్తకాలు, ఆట వస్తువులు పంపిణీ చేసిన**

**- జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు**

**గద్వాల జూన్ 24**

**(వుదయం కరస్పాండెంట్)**

గద్వాల జిల్లా కేంద్రంలోని పాత ఎస్పీ కార్యాలయం సమీపంలో ఉన్న 'మన' డ్రగ్స్ డీఅడిక్షన్ (వ్యసన విముక్తి) కేంద్రాన్ని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో చికిత్స పొందుతున్న వారి కోసం నిర్వాహకులకు నోటు పుస్తకాలను, ఆట వస్తువులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మద్యపానం, డ్రగ్స్, ఆల్కహాల్, తంబాకు వంటి రకరకాల మత్తు పదార్థాలకు బానిసలైన వారిని ఆ వ్యసనాల నుంచి దూరం చేసి, వారికి పునరావాసం కల్పించడమే ఈ కేంద్రం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మత్తు పదార్థాలు ఉపయోగించే వారిపై ప్రతిరోజూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, వారికి కౌన్సిలింగ్, ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యసనపరులు తమ అలవాట్లను మానుకుని సాధారణ జీవితం గడిపేలా ఇక్కడ అన్ని వసతులతో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు గద్వాల సర్కిల్ ఇన్స్పెక్టర్ టంగుటూరి శ్రీను, గద్వాల్ టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ కళ్యాణ్ కుమార్, కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

# భూపాల్ రెడ్డి చేతులమీదుగా ఎల్.ఓ.సీ.



**- శివాయిపల్లి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నిధులు మంజూరు......**

**జూన్ 24 పెద్ద శంకరంపేట:**

**వూదయం ప్రతినిధి**

మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలంలోని శివాయిపల్లి గ్రామానికి చెందిన దండు రత్నమ్మ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీ.ఎం.ఆర్.ఎఫ్) కింద మంజూరైన ఎల్ఓసీని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆమె భర్త దండు లక్ష్మయ్యకు అందజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపద సమయంలో సీఎం సహాయ నిధి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక భరోసా పొందాలని సూచించారు.అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో కొంపల్లి ప్రవీణ్, కుక్కల అంజయ్య, చిలకముక్కు మల్లేశం, నర్సింహారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పాగుంట మండల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన



**- బిజెపి జిల్లా యువ నాయకురాలు డికె.స్నిగ్ధ రెడ్డి**

**కెటిదొడ్డి జూన్ 24**

**(వుదయం ప్రతినిధి)**

కెటి దొడ్డి మండల కేంద్రంలో పాగుంట గ్రామంలో బుధవారం పాగుంట మండల క్రికెట్ ప్రీమియర్ లీగ్ డి.కె. స్నిగ్ధారెడ్డి ను ప్రారంభించారు.కఈ సందర్భంగా డికె. స్నిగ్ధ రెడ్డి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటమిలో సమానంగా స్వీకరించాలి.దేశ ప్రతిష్టను పెంచుతూ క్రీడాకారులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఖేలో ఇండియా కార్యక్రమం తీసుకొని నూతన ఉత్తేజాన్ని యువతలో నింపుతున్నారు. ఓడిపోయిన వారు కృంగిపోకుండా గెలుపు దిశగా పయనించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉత్తేజపరుస్తూ ప్రోత్సహిస్తున్నారు. విద్యతో పాటు క్రీడ నైపుణ్యత పొంది క్రీడా రంగంలో కూడా రాణించాలి అని కోరారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమే, ఓడిపోయినా నిరుత్సాహ పడకుండా స్నేహపూర్వకంగా క్రీడలను ఆడి, ఓడిపోయినా ఓటమి విజయానికి నాందిగా భావించాలని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల క్రీడా నైపుణ్యంతో జిల్లా, జాతీయస్థాయిలో క్రీడల్లో రాణించి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మండల అధ్యక్షుడు పాద రెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు, ఉప సర్పంచ్ నర్సిరెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ఎర్ర బీమ్ రెడ్డి, బబుల్ రెడ్డి, హన్మి రెడ్డి, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

# రేణుక ఎల్లమ్మ దేవి గుడి నిర్మాణానికి 51 వేల విరాళం



గుండాల గ్రామం లో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి గుడి నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు మల్లేపల్లి పర్వత్ రెడ్డి 51 వేల రూపాయల విరాళం గుడి కమిటీ సభ్యులకు అందజేశారు సందర్భంగా రౌతు రెడ్డి కి గుండాల గ్రామ ఎల్లమ్మ దేవి ఉత్సవ కమిటీ తరపున శాలువాలు పప్పి సన్మానించి ధన్యవాదములు తెలిపారు ఈ కార్యక్రమం లో డిప్యూటీ సర్పంచ్ కొమ్ము లింగం,,శేఖరయ్య .రాములు ,లింగం, అంజయ్య కృష్ణ ,జంతుక రామస్వామి తదితరులు పాల్గొన్నారు

# పూర్వ వైభవం సంతరించుకోనున్న పెరుగు రాజన్న కుంట



**- కబ్జాదారుల చెర నుంచి విముక్తి – హద్దుల కాలువ పనులు ప్రారంభం**

**- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూ**

**-ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు**

**కోహెడ,**

**జూన్ 24:(వుదయం ప్రతినిధి)**

కోహెడ మండల శివారులోని పెరుగు రాజన్న కుంట పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా అధికారులు కీలక చర్యలు చేపట్టారు. సర్వేనెంబర్ 369 లో 29 ఎకరాల విస్తీర్ణం గల చెరువు గత కొంతకాలంగా ఆక్రమణలకు గురైన కుంటను కబ్జాదారుల చెర నుంచి విముక్తి చేసి, బుధవారం హద్దుల కాలువల గుర్తింపు మరియు పునరుద్ధరణ పనులను జేసీబీల సహాయంతో ప్రారంభించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ శాఖల సమన్వయంతో అధికారులు కుంట పరిధిని పరిశీలించి, అసలు హద్దులను గుర్తించే ప్రక్రియను చేపట్టారు. కుంటకు సంబంధించిన హద్దుల కాలువలను పునరుద్ధరించడం ద్వారా ఆక్రమణలకు అడ్డుకట్ట పడటంతో పాటు భవిష్యత్తులో చెరువు పరిరక్షణకు బాటలు పడనున్నాయని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా ఆక్రమణల కారణంగా తన అసలు రూపాన్ని కోల్పోయిన పెరుగు రాజన్న కుంటకు మళ్లీ జీవం పోసే చర్యలు ప్రారంభం కావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. కుంట పరిరక్షణ కోసం సహకరించిన రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ శాఖల అధికారులతో పాటు గ్రామ సర్పంచ్ మ్యాకల స్వర్ణలత సురేందర్ రెడ్డికి , కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కోతి ఉదయభాస్కర్ కూ, వుదయం తెలుగు దినపత్రిక వార్త కథనాలతో కబ్జాదారుల చెరనుండి చెరువును విడిపించుటకు కృషిచేసిన సీనియర్ జర్నలిస్ట్ రాగుల సతీష్ కూ గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు. పెరుగు రాజన్న కుంట పూర్తిస్థాయిలో పునరుద్ధరణ జరిగితే భూగర్భ జలాలు పెరగడంతో పాటు రైతులకు, మత్స్యకారులకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఇటిక్యాల ఎంపీడీఓగా రమాదేవి



**ఇటిక్యాల జూన్ 24**

**(వుదయం ప్రతినిధి)**

ఇటిక్యాల నూతన ఎంపీడీవో గా రమాదేవి నూతనంగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇదే ఇటిక్యాల మండలంలో ఆమె పర్యవేక్షకులుగా విధులు నిర్వహించారు. 2024 లో బదిలీలో భాగంగా గద్వాల్ ఎంపీడీవో ఆఫీస్ కు వెళ్లారు. ఇటీవల ప్రభుత్వం పదోన్నతులు కల్పించడం జరిగింది. అందులో భాగంగా పర్యవేక్షకులు నుంచి ఎంపీడీవోగా రావడం జరిగింది. బాధ్యతలు స్వీకరించిన రమా దేవిని సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ "మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది అందరం కలిసి మండలం అభివృద్ధికి కృషి చేయాలని, అంతేగాక ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని కోరడం జరిగింది.

# సరైన ఓటరు జాబితా బలమైన ప్రజాస్వామ్యానికి పునాది : ఖమ్మం వెంకటేశం



**కోహెడ జూన్ 24:**

**(వుదయం ప్రతినిధి )**

రేపటి నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో భాగంగా బీజేపీ పార్టీ తరపున నియమించబడిన BLA2లు తమ తమ గ్రామాల్లోని BLOలు, BLAలతో సమన్వయంగా పనిచేస్తూ అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా చూడాలని బీజేపీ హుస్నాబాద్ అసెంబ్లీ SIR ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, SIR కార్యక్రమంపై కొందరు రాజకీయ పార్టీలు చేస్తున్న అపోహలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకోవడం ఎంత ముఖ్యమో, ఓటరు జాబితాలు ఖచ్చితంగా మరియు పారదర్శకంగా ఉండటం కూడా అంతే ముఖ్యమని అన్నారు.

SIR కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం ఓటరు జాబితాలను మరింత కచ్చితంగా రూపొందించడమేనని ఆయన వివరించారు. కాలక్రమేణా మరణించిన వ్యక్తుల పేర్లు, ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓట్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి వివరాలను గుర్తించి సరిచేయడం ద్వారా ఎన్నికల వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చడమే లక్ష్యమన్నారు.

అర్హత ఉన్న ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో కొనసాగేందుకు అవసరమైన అవకాశాలు, విధానాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా తమ ఓటరు వివరాలను ఒకసారి పరిశీలించుకుని, అవసరమైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించి తమ పేర్లు సక్రమంగా నమోదై ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. బలమైన ప్రజాస్వామ్యానికి స్వచ్ఛమైన, ఖచ్చితమైన ఓటరు జాబితాలు అవసరమని, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి ఈ ప్రక్రియలో భాగస్వామి కావాలని ఖమ్మం వెంకటేశం కోరారు.

# జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య



**ప్రొసీడింగ్ అందజేసిన డీఈఓ**

**గద్వాల జూన్ 24**

**(వుదయం ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించుటకు జిల్లా విద్యాశాఖ అధికారిని విజయ లక్ష్మి ప్రొసీడింగ్ ను బుధవారము జర్నలిస్టులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అనేక మంది జర్నలిస్టులు నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారని, పత్రికలు, టీవీ యాజమాన్యాల నుంచి తగిన ఆర్థిక సహాయం అందకపోవడంతో కుటుంబ పోషణతో పాటు పిల్లల విద్యాభారం మోయడం కష్టంగా మారిందని తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో విద్యా ఖర్చులు గణనీయంగా పెరిగిపోవడంతో జర్నలిస్టుల పిల్లల చదువులు కొనసాగించడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజానికి సేవలందిస్తున్న జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకునే దిశగా ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న వారి పిల్లలకు ఉచిత విద్యను అందించే విధంగా ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలని డీఈఓను కోరాగా జర్నలిస్టు పిల్లలకు ఒకరికి ఉచితంగా, మరొకరికి 50 శాతం ఫీజులో రాయితీ ప్రొసీడింగ్ ను జర్నలిస్టులకు అందజేశారు. ప్రొసీడింగ్ కాపీ, అక్రిడేషన్ కార్డు జిరాక్స్ కాపీలను సంబంధిత పాఠశాలలో ఇవ్వాలని, ఈ అవకాశాన్ని ప్రతి అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులు వినియోగించుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పెద్ద ఇస్మాయిల్, ముకుందరావు, బలరాం, కృష్ణ, మహేష్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపేట లో ప్రీప్రైమరీ పాఠశాల ప్రారంభం




**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ, గ్రామ సర్పంచ్ చలిమేటి నరేందర్ ఆధ్వర్యంలో ప్రీప్రైమరీ పాఠశాలను ప్రారంభించారు. అనంతరం యూకేజీ, ఒకటో తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రీప్రైమరీ విద్యకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాఠశాలలో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానమాల,ఉపసర్పంచ్ గెరిగంటి బాబు, అధ్యక్షులు వెల్దుర్తి వెంకటేష్‌గౌడ్, వార్డు సభ్యులు బండారి ఎల్లం, దుర్గయ్య, నజీమా, సంధ్యారాణి, తాడేం లత, కార్యదర్శి సరితాదేవి, ఉపాధ్యాయులు రాజేందర్, శ్రీనివాస్, శ్రీలత, బాలమణి, భాను, లక్ష్మి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ మృతికి నిరసన...

**కోరుట్ల జూన్ 24**

**(వుదయం ప్రతినిధి)**

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన అంకం రాహుల్ మృతిచెందిన విషయం తెలిసిందే ఇట్టి విషయంలో ఇప్పటివరకు మృతి చెందిన వ్యక్తి ఈ ఎన్ జి ఈఈసి థర్డ్ ఇయర్ ఇట్టి వ్యక్తి తల్లిదండ్రులు పద్మశాలి సంఘములను ఆశ్రయించగా ఇట్టి వ్యక్తి హత్య ఆత్మహత్య నా పూర్తి విచారణ జరిపించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయుటకు కోరుట్ల పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం దగ్గర నిరసన వ్యక్తం చేయుటకు తేదీ 25 6 2026 గురువారం ఉదయం 10 గంటలకు తెలంగాణ పద్మశాలీలు నిరసన తెలియజేస్తారు కావున ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా మిత్రులు హాజరుకావాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్ర శ్రీనివాస్ కోరారు

# కలెక్టరేట్ అధికారులు స్వయంగా విచారణకు రావాల్సిందే.....!

**- ఎవరినో పంపి చేతులు దులుపుకుంటే కుదరదు**

**- చట్టాలు, కమీషన్ అంటే గౌరవం లేదా..?**

**- సమాచార కమీషన్ పివి శ్రీనివాస్ రావు ఆగ్రహం...**

**- లక్ష రూపాయల పరిహారం ఇప్పించాలని...**

**- సీనియర్ ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి దరఖాస్తు...**

**జగిత్యాల జూన్ 24**

**(వుదయం ప్రతినిధి)**

జగిత్యాల జిల్లా కలెక్టరేట్ అధికారులు బుధవారం తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ హైదరాబాద్ లో జరిగిన కేసుల విచారణకు హాజరు కాకుండా డీపీవో కార్యాలయ సిబ్బందిని పంపడం పట్ల సమాచార కమీషన్ పివి శ్రీనివాస్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ నుండి ఎవరికైతే నోటీసులు జారీ చేశామో వారే స్వయంగా కేసుల విచారణకు హాజరు కావాలని బుధవారం రాష్ట్ర సమాచార కమీషన్ పివి శ్రీనివాస్ రావు స్పష్టం చేశారు జగిత్యాల జిల్లా కలెక్టరేట్ అధికారులకు నోటీసులు పంపిస్తే జిల్లా పంచాయతీ అధికారులు హాజరు కావడం పట్ల ఆయన మండిపడ్డారు చట్టాలు కమీషన్ లు ధర్మాసనాలు అంటే జగిత్యాల జిల్లా కలెక్టరేట్ అధికారులకు గౌరవం లేదా..? అని ఆయన ప్రశ్నించారు చట్టాలను కమీషన్ లను ధర్మాసనాలను తీర్పుల గౌరవించాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు గౌరవించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు కలెక్టరేట్ అధికారులు సైతం స్వయంగా విచారణకు రావాల్సిందేనని ఎవరినో పంపి చేతులు దులుపుకుంటే కుదరదు అని ఆయన తేల్చి చెప్పారు ప్రజలు ఆర్టీఐ కార్యకర్తలు చట్ట బద్ధంగా అడిగిన సమాచారాన్ని నిర్ణీత గడువు లోపల దరఖాస్తుదారులకు అందజేయాల్సిందేనని ఆయన పేర్కొన్నారు సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తే చట్టానికి లోబడి శిక్షలు అనుభవించాల్సి వేస్తుందని ఆయన హెచ్చరించారు సామాజిక కార్యకర్త సీనియర్ ఉద్యమ నాయకులు చుక్క గంగారెడ్డి కి సంబందించిన నాలుగు కేసులను బుధవారం క్షుణ్ణంగా విచారించారు అందులో అధికారులు చేసిన పొరపాట్లను ఆయన ఎత్తి చూపారు హాజరైన డిపివో కార్యాలయ ప్రజా సమాచార అధికారులకు చీవాట్లు పెట్టారు జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రజా సమాచార అధికారులు ఈ కేసుల విచారణకు రావాల్సిందేనని ఆదేశించారు గత విచారణకు అధికారులు ఎవరు కూడా హాజరు కాకపోవడం పట్ల చర్యలు తప్పవని ఆయన మరో మారు హెచ్చరించారు కాగా పలుమార్లు కేసు వాయిదాలకు హాజరైన ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి ఈ నాలుగు కేసుల్లో అధికారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞాపన పత్రం అందజేశారు తనకు చట్టబద్ధంగా ఒక్కొక్క కేసులో 25 వేల రూపాయల చొప్పున నాలుగు కేసులకు కలిపి మొత్తం 1 లక్ష రూపాయల పరిహారం బాధ్యులైన అధికారుల నుండి చట్టబద్ధంగా ఇప్పించాలని చుక్క గంగారెడ్డి బుధవారం సమాచార కమీషన్ కు దరఖాస్తు చేసుకున్నారు తాను కోరిన పూర్తి సమాచారం ఇప్పించడంతో పాటు సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 19 (8) బి 20 (1) ల ప్రకారం సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం ఉద్దేశ్య పూర్వక వైఖరి అవలంబించిన ప్రజా సమాచార అప్పీలేట్ అధికారులపై చర్యలు తీసుకొని రాష్ట్రంలో ఎక్కడ కూడా ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని చుక్క గంగారెడ్డి సమాచార కమీషన్ ను కోరారు




# నేరాల నియంత్రణ ప్రజా భద్రత విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి...

**- రెనోవేషన్ చేసిన మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**మెట్ పల్లి జూన్ 24**

**(వుదయం విలేకరి)**




ఆధునిక సౌకర్యాలతో పునరుద్ధరించిన (రెనోవేషన్ చేసిన) మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్ బుధవారం ప్రారంభించారు ఈ సందర్భంగా కార్యాలయంలో కల్పించిన సౌకర్యాలు రికార్డుల నిర్వహణ భద్రతా చర్యలు సిబ్బంది పని తీరు ప్రజలకు అందిస్తున్న సేవలను ఎస్పీ పరిశీలించారు అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి కార్యాలయ పరిసరాల పరిశుభ్రత ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అంశాలపై సూచనలు చేశారు పోలీస్ కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండటంతో పాటు సిబ్బందికి అనుకూలమైన వాతావరణం కల్పించడం ద్వారా సేవల నాణ్యత మరింత మెరుగు పడుతుందని పేర్కొన్నారు అనంతరం వార్షిక తనిఖీల్లో భాగంగా సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించిన ఎస్పీ సర్కిల్ పరిదిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో ఉన్న సిడి ఫైల్స్ ను పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైల్లను పరిశీలించారు గ్రేవ్ కేసులలో ఫోక్సో కేసులలో నిందితుల కు శిక్షలు పడే విధంగా క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని సిబ్బంది పని తీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సిఐ కి సూచించారు సర్కిల్ పరిదిలోని రౌడీ షీటర్లు హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు కమ్యూనిటీ పోలీసులలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు సైబర్ నేరాలు వివిధ సామాజిక అంశాలపై ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని అదేవిధంగా సి సి కెమెరాలు యొక్క ప్రాముఖ్యత గురించి గ్రామాల్లో తెలియజేస్తూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు అలాగే నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మాదకద్రవ్యాల నిర్మూలన రోడ్డు భద్రత శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు ఈ సందర్భంగా మెట్ పల్లి సర్కిల్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు ఈ కార్యక్రమంలో డిఎస్పీ రాములు సిఐ లు సురేష్ బాబు లక్ష్మీ నారాయణ డిసిఆర్బి ఎస్ఐ ప్రదీప్ ఎస్సైలు కిరణ్ కుమార్ అనిల్ చిరంజీవి నవీన్ గంగాధర్ రాజునాయక్ రవికిరణ్ శ్రీధర్ రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు